హైదరాబాద్ వార్త



# బీరు.. జోరు



**వేసవితో బీరుకు డిమాండ్**

**రికార్డు స్థాయిలో పెరిగిన విక్రయాలు**

**రోజుకు 5లక్షల కేసులకు పైగా అమ్మకాలు**

**దేశీబీర్ల సరఫరా తగ్గిందంటున్న వ్యాపారులు**

హైదరాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: ఎండలతోపాటు బీరు అమ్మకాలూ జోరందుకున్నాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు మద్యం ప్రియులు బీర్లు ఎక్కువగా తాగుతుండటంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డిమాండ్ భారీగా పెరిగింది. గత వేసవిలో ఇదే నెలలో రోజుకు మూడున్నర నుంచి నాలుగు లక్షల కేసులను విక్రయించగా ప్రస్తుతం 5లక్షలకు చేరిందని వ్యాపారులు అంటున్నారు. బీర్ల కొరత ఏర్పడటంతో కొందరు వ్యాపారులు అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రేటర్ పరిధిలో సాధారణ రోజుల్లో రోజుక లక్షల నుంచి రెండు లక్షల కేసులు అమ్మితే వేసవి లో మాత్రం రెట్టింపు అమ్మకాలు జరుగుతుంటాయి. అమ్మకాల పెరుగుతున్న నేపథ్యంలో బీరు ఉత్పత్తి కంపెనీలకు బేవరేజ్ కార్పొరేషన్ నుంచి పెద్దమొత్తంలో ఆర్డర్లు పెరుగుతున్నాయి. జంటనగరాల్లో బీరుకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుం టున్నారు. అమ్మకాలు పెంచేందుకు వ్యాపారులకు టార్గెట్లు ఇస్తున్నారు. ప్రతి సంవత్సరం వేసవిలో మార్చి కంటే ఏప్రిల్,మే నెల్లోనే బీరు విని యోగం ఎక్కువగా ఉంటుంది. ఈసారి మార్చి ప్రారంభం నుంచే వినియోగం భారీగా పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో వ్యాపారులకు ఇచ్చే టార్గెట్లు పూర్తయిపోయి అదనంగా బీరు కొనుగోలు చేసేందుకు ఆర్డర్లు ఇస్తున్నట్లు తెలుపుతున్నారు. అయితే సరఫరా మాత్రం తక్కువగా ఉండం టున్నారు. బీరు అమ్మకాలతో పోలిస్తే మిగతా లిక్కర్ అమ్మకాలు తక్కువగా ఉంటున్నట్లు చెబుతున్నారు. జంటనగరాల్లో మూడుజిల్లాల్లో 250కిపైగా మద్యం దుకాణాలు, మరో 216బార్లు, 18క్లబ్బులు కలిసి సాధారణ రోజుల్లో 50 నుంచి 60వేల కేసులు బీరు అమ్మకాలు జరిగితే ఈసారి రోజుకు 4లక్షలనుంచి 5లక్షల కేసులను అమ్ముడం జరుగుతోందని అంటున్నారు. అయితే సరఫరాలో కొరత నేపథ్యంలో కొందరు వ్యాపారులు ఇదే అదనుగా విదేశీ బీరు అమ్మకాలు పెంచుకుంటున్నారు. దేశీయ కంపెనీలు తయారు చేసే బీరు కంటే విదేశీబీరు ధర 30నుంచి 50 రూపాయిల వరకు అధికంగా ఉటుంది. కొందరు వ్యాపారులు వీటి ధరలు కూడా పెంచేఅమ్ము తున్నారు. మరి కొందరు వ్యాపారులైతే దేశీయ బీరును కూడా కొరతపేరు చెప్పి ధరను పెంచి విక్రయిస్తున్నారు. ధరలు నియంత్రించాల్సిన అధికారులు పెద్దగా స్పందించడం లేదు. దీంతో మార్కెట్లో బీరు డిమాండ్‌ను కొందరు వ్యాపారులు తమనకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



## హనుమాన్ జయంతికి మద్యం దుకాణాలు బంద్

హైదరాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ఈనెల 6వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయాలని సిపి డిఎస్ చౌహాన్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి 7వ తేదీన ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు, కల్లు దుకాణాలు మూసి ఉంటాయని సిపి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిపి డిఎస్ చౌహాన్ హెచ్చరించారు.

## టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ఓయులో ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర



ప్రభుత్వం దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న జేపీసీ నేతలు

తార్నాక, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్, ఓ.యూ జాక్ ఆద్వర్యంలో మంగళవారం ఓ.యూ మేయిన్ లైబ్రరీ నుంచి ప్రభుత్వం దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి భాద్యత వహించి చైర్మన్, బోర్డు సభ్యులను తక్షణమే భర్తరఫ్ చేయాలని వేల్పుల సంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లీకేజీ విషయంలో విచారణలో ఉండగా రద్దయిన పరీక్షలను ఏవిధంగా నిర్వహిస్తారని ప్రశ్నించారు. లీకేజీపై సిట్టింగ్ జడ్జితోలేదా సిబిఐతో విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజ్ ఎదుట దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి పల్లెల సుధాకర్, డిబీఎస్ఏ స్టేట్ కోఆర్డినేటర్ జంగిలి దర్శన్, ఆదివాసీ స్టూడెంట్ ఫోరం స్టేట్ వైస్ ప్రసిడెంట్ అజయ్‌కుమార్, కె.తిరుపతి, సురేష్, అంబేద్కర్, ప్రవీణ్, చందు శ్రీనివాస్, యుగెందర్, స్వామి, తగర ప్రవీణ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో అగ్రగామిగా శేరిలింగంపల్లి



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వవిప్ గాంధీ

**ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ**

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ, సుమిత్రనగర్, బాగ్ అమీర్ కాలనీలలో రూ. 81.23లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీరోడ్డు, యుజిడి నిర్మాణ పనులకు ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్పొరేటర్ మాదవరం రోజాదేవి రంగారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి అగ్రగామిగా నిలపడమే తన ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా అభివృద్ధి ఆగకూడదనే ఉద్దేశ్యంతో సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాన్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈఈ గోవర్ధన్, ఏఈ ఆశ, డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రియాంక, మాజీ కార్పొరేటర్ రంగారావు, పెద్ద భాస్కర్‌రావు, చంద్రకాంత్‌రావు, రాంచందర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబరు 15న ఢిల్లీలో ఆలిండియా బహుజన రైటర్స్ జాతీయ సదస్సు

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: సాహిత్యం సమాజ వికాసానికి దోహదపడుతుందని విప్లవగాయనీ, అరుణోదయ విమలక్క పేర్కొన్నారు. బహుజన రాజ్యాధికార సాధనకు ఇది దోహదపడుతుందని అన్నారు. ప్రపంచంలో ప్రజల కోసం జరిగిన పోరాటాలన్నింటికి సాహిత్యం బాసటగా నిలిచిందని అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బహుజన సాహిత్య అకాడమి 6వ తెలంగాణ రాష్ట్ర సదస్సు రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం.గౌతమ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన విమలక్క మాట్లాడుతూ బహుజన సాహిత్య అకాడమి(బిఎస్ఏ) దేశ స్థాయిలో బహుజనుల చైతన్యం కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గౌరవ అతిథిగా హాజరైన బహుజన సాహిత్యఅకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ దేశంలో బహుజన రాజ్యాధికారం, చైతన్యం కోసం అన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర సదస్సులు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అక్టోబరు 15న ఢిల్లీలో ఆలిండియా బహుజన రైటర్స్ జాతీయ సదస్సు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమి ఎపి రాష్ట్ర అధ్యక్షుడు జంపన శ్రీనివాస్‌గౌడ్, మహారాష్ట్ర శాఖ కార్యదర్శి కంది శ్రీనివాస్, ఉత్తరాఖండ్ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌చంద్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాదేవి రమేశ్ , రాష్ట్ర కార్యదర్శులు కనుకుంట్ల విజయకుమార్, నీరుడు కృష్ణ, హెచ్.విష్ణు, బి.వెంకటేశం, కమ్మరి సత్యనారాయణ, మట్ల వెంకటయ్యగౌడ్, ఎం.పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి



కళాభిమాని డాక్టర్ కె.వి.రావును సత్కరిస్తున్న డాక్టర్ అయాచితం శ్రీధర్, చిత్రంలో కళావిఎస్.జనార్ధనమూర్తి

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: స్వచ్ఛంద కళా సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్ అన్నారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావవేదికలో గానసభ పూర్వ అధ్యక్షుడు, స్వర్గీయ కళావేంకట దీక్షితులు జయంతి సందర్భంగా ప్రస్తుత గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన రెండవ రోజు కార్యక్రమంలో ఘంటసాల గానసభ అధ్యక్షుడు, కళాభిమాని డాక్టర్ కె.వి.రావుకు 'కళావేంకటదీక్షితులు' పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సంగీత గురువు సంయుక్త శిష్యబృందం ఆధ్వర్యంలో త్యాగరాజ, రామదాసు, అన్నమయ్య కీర్తనలను మధురంగా గానం చేశారు. పురస్కారాన్ని ప్రదానం చేసిన అనంతరం డాక్టర్ అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ కళావేంకట దీక్షితులు తన జీవితాన్ని త్యాగరాయ గానసభకు అంకితమిచ్చిన మహానుభావుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కథక్‌కళాక్షేత్ర అధినేత పండిట్ అంజుబాబు, గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గాజులరామారం పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



జీడిమెట్ల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి గాజులరామారం గ్రామంలోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గాజులరామారం గ్రామం సర్వేనెం342 ప్రభుత్వ భూమిలో అక్రమంగా కట్టిన 8గదులను అధికారులు గుర్తించి తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

# పదోన్నతుల్లో ఆలస్యమెందుకు..?

గోషామహల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: పోలీసు విభాగంలో కానిస్టేబుల్స్ పదోన్నతి పొందాలంటే ఒక న్యాయం...అదే కానిస్టేబుల్ ముందు ఎస్ఐగా పోలీసు విభాగంలో చేరిన వారికి సిఐ,ఎసిపి అదనపు ఎస్పి అవుతారు.కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా పదోన్నతి పొందడ లేదు. ఇది పోలీసు విభాగంలో సంగతి.. పోలీసు విభాగం క్రమ శిక్షణకు మారుపేరఅంటారు. కాని వారికి మాత్రం పదోన్నతి ఇవ్వరని వాపోతున్నారు. 24గంటల పాటు శాంతిభద్రతలను కాపాడు తుండడంలో కానిస్టేబుల్ పాత్ర గణనీయం ఉంటుంది.1983 సంవత్సరంలో పోలీసు విభాగంలో చేరిన వారికి నేటికి కొందరికి ఎస్ఐలుగా పదోన్నతి లభించడంలేదు. దాదాపు 42 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్నప్పటికి వారికి గత రెండు సంవత్సరాలక్రితం ఎస్ఐలుగా పదోన్నతి పొందేందుకు గాను శిక్షణ కూడా ఇచ్చారు. కాని పదోన్నతి మాత్రం ఇవ్వడంలేదని వాపోతున్నారు. ప్రమోషన్లు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టులతోపాటు వివిధ విభాగాలల్లో కానిస్టేబుళ్లు,ఎస్ఐలు, సిఐలు డిప్యూటేషన్‌లపై విధులను నిర్వహిస్తున్నారు. 1983,84 కానిస్టేబుళ్లలో కొందరికి ఎ.ఎస్.ఐ నుంచి ఎస్ఐగా ప్రమోషన్లు పొందారు. మరికొందరికి ఎ.ఎస్.ఐలకు ఎస్ఐలుగా ప్రమోషన్లు ఇవ్వకుండా నిలిపి వేసినట్లు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.ఎ.ఎస్.ఐలకు మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి రెండు సంవత్సరాలు దాటిందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.తమ బ్యాచ్ వారికి ఎస్ఐలుగా ప్రమోషన్లు ఇచ్చారు.మకేందుకు ఇవ్వడలేదో అర్థం కావడంలేదని వాపోతున్నారు. ఏమంటే క్రమశిక్షణ విభాగం కావడంతో ఉన్నతాధికారులకు తెలిసినప్పటికి ప్రమోషన్లు ఇవ్వడం లేదన్నారు. పలు పోలీస్‌స్టేషన్లలో ఎ.ఎస్.ఐలుగానే విధులను నిర్వహిస్తున్నామన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని 80పైగా ఉన్న ఎ.ఎస్.ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పించేందుకుగా ఇటీవల డిజిపి కార్యాలయం నుంచి నగర పోలీస్ కమీషనర్ కార్యాలయానికి ఎ.ఎస్.ఐలకు ఎస్ఐగా ప్రమోషన్లు ఇచ్చేందుకుగాను వారిపై ఎలాంటి కేసులు ఉన్నాయా లేదా అని విచారణ జరిపి నివేధికను అందించాలని డిజిపి కార్యాలయం నుంచి నగర పోలీస్ కమీషనర్ కార్యాలయానికి ఆదేశాలతో పాటు జాబితాను పంపించి దాదాపు మూడునెలలు అవుతుంద న్నారు. 72 పోలీసు స్టేషన్‌లలో ఇద్దరు,లేదా.ముగ్గరు చొప్పున ఉన్నారు.వారి చేతనే విధులను నిర్వహిస్తున్నారు. ఎ.ఎస్.ఐ నుంచి ఎస్ఐగా ప్రమోషన్లు కల్పించినట్లయితే ఆయా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఎస్ఐలపై భారం తగ్గుతుందని,ఎస్ఐగా ప్రమోషన్లు పొందిన తరువాత ఆయా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐలుగా లేని వారి స్థానంలో వారికి భర్తీ చేయడం ద్వారా కొంత వరకైనా పని వత్తిడి తగ్గుతుంది.డిజిపి కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతి ఫైళ్లను డిజిపి అంజనీకుమార్ పరిశీలించి ఎస్ఐలుగా పదోన్నతి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న తెలంగాణ హోంశాఖ మంత్రి మహమ్మూద్‌అలీ, ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ తదితరులు

గన్‌ఫౌండ్రి, ఏప్రిల్ 4ప్రభాతవార్త: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం తెలంగాణ నాన్‌గజిటెడ్ హైదరాబాద్ జిల్లా ఆద్వర్యంలో ప్రతియేటా మాదిరిగానే ఈ యేడు కూడా జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ ఆద్వర్యంలో ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.ఈ ఇఫ్తార్ విందులో తెలంగాణ రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మూద్ అలీ,మంత్రి ఎం.శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ నాన్‌గజిటెడ్ సెంట్రల్ అధ్యక్షులు ఎం.రాజేందర్ వక్ఫ్ బోర్డు చైర్మన్ మసిఉల్లా,మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్‌ఇషాక్, హౌజ్‌కమిటి చైర్మన్ సలీం,ఉర్దూ అకాడమీ చైర్మన్ తారిఖ్‌అన్సారీ,గ్రంథాయల చైర్మన్ ఆయాచితం శ్రీధర్,బెవరేజెస్ చైర్మన్ గజ్జల నాగేష్,హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్,బిఆర్ఎస్ నాయకులు దాసోజ్‌శ్రావన్, కేంద్ర కమిటి కార్యదర్శి ఆర్.పత్రాప్,జిల్లా కార్యదర్శి విక్రమ్,కోశాధికారి బాలరాజ్,సహ అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్,కె.శ్రీనివాస్,నరేష్‌కుమార్, ఎం.ఎ.ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.అంతకు ముందు ప్రత్యేక ప్రార్దనలు చేశారు.ఇఫ్తార్ విందు ఇచ్చారు.జిల్లాలోని అన్ని విభాగాల యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్**



చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ధర్నాచౌక్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: పేదల ప్రభుత్వమే ప్రభుత్వ లక్ష్యమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్పష్టం చేశారు. మంగళవారం ముషీరాబాద్‌లోని మహ్మదీయ ఫంక్షన్ హాల్ నందు ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన 248 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను, జీవో నెంబర్ 58, 59 ద్వారా క్రమబద్ధీకరించుకున్న వారికి పట్టా పత్రాలను రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీలతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల వివాహ గతంలో తల్లి తండ్రులకు ఎంతో భారంగా ఉండేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ వారిని ఆదుకునేందుకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ల పేరుతో లక్షా వెయ్యినూట పదహారు రూపాయలు అందచేస్తు న్నారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలుచేయటం పట్ల ఇతర రాష్ట్రాలు సైతం అభినందిస్తున్నాయని తెలిపారు. అదే విధంగా 58, 59 జీవోల ప్రకారం దరఖాస్తు చేసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్ 30 వరకు అవకాశం కల్పించిందని, లబ్ధిదారులు ఎవరైనా గతంలో దరఖాస్తు చేసుకోలేకపోతే తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, ముషీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన అధ్యక్షులు నర్సింగ్ ప్రసాద్, వల్లాల శ్యాం యాదవ్, రాకేష్‌కుమార్, రావులపాటి మోజెస్, శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు పోతుల శ్రీకాంత్, దామోదర్‌రెడ్డి, సురేందర్, ఆకుల అరుణ్ కుమార్, బీజేపీ నాయకులు ఎం.నవీన్‌గౌడ్, వెంకటేష్, గడ్డం నవీన్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు శ్రీధర్‌రెడ్డి, శివముదిరాజ్, సోమన్, గోరఖ్నాద్, ముషీరాబాద్ తహసీల్దార్ అయ్యప్ప పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ



హెచ్‌ఎఫ్‌నగర్‌లో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని జూబ్లిహిల్స్ శాసన సభ్యులు హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు మాగంటిగోపినాథ్ అన్నారు. మంగళవారం రహ్మత్‌నగర్ హెచ్‌ఎఫ్‌నగర్‌లోని మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్‌లో దాదాపు 44మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెలోన్ల దేవుడిలా ఉన్నారన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేటపుడు దళారులని నమ్మవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, దేదివ్య విజయ్‌కుమార్, రాజ్‌కుమార్‌పటేల్, డివిజన్ అధ్యక్షులు డి.సంజీవ, మన్సూర్, కృష్ణమోహన్, సంతోష్, జిటియస్ దేవాలయం చైర్మన్ చిన్నరమేస్, బోరబండ దేవాలయం చైర్మన్ లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

## భారీ చోరీ కలకలం

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : హైదరాబాద్‌లోని సీతా సరోవర్ అపార్ట్‌మెంట్‌లో భారీ చోరీ ఘటన కలకలం రేపింది. చోరీ జరిగినప్పటి నుంచి ఇంట్లో పనిచేసే మహిళ కనిపించకుండా పోవడంతో ఆమేనే చోరీకి పాల్పడినట్లు ఇంటి యజమాని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్ ల్యాండ్స్‌లోని శాంతిబాగ్ కాలనీ సీతా సరోవర్ అపార్ట్‌మెంట్‌లో నారాయణ అనే వ్యక్తి ఇంట్లో వారం రోజుల క్రితం సునీత అనే మహిళ పనికి చేరింది. నిన్న యజమాని ఇంట్లో నగలు కనిపించకపోవడంతో అల్మారా తీసి చూడగా విలువైన వజ్రాల గొలుసు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో కిలోన్నరకు పైగా బంగారం చోరీ అయినట్లు బాధితుడు తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి పనిమనిషి గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

**ఈనెల 6వ తేదిన గౌలిగూడ రామమందిరం నుంచి**

## హనుమాన్ శోభయాత్ర ప్రారంభం

గోషామహల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: హన్‌మాన్ జయంతిని పురస్కరించుకుని బజరంగ్‌దళ్ ఆద్వర్యంలో ఈనెల 6వ తేదిన నిర్వహించే శోభయాత్ర గౌలిగూడ రామమందిరం వద్ద ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని విశ్వహిందు పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శాలివాహన పండరీ నాథ్,భజరంగ్‌దళ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శివరాంజీలు తెలిపారు.గౌలిగూడ రామమందిరంలో ముందుగా యజ్ఞ పూజ కార్యక్రమం జరుగుతుందని,అటు తరువాత హన్‌మాన్ చాలీసా అనంతరం శోభయాత్ర బయలు దేరి పుత్లీబౌలి,కోఠి ఆంధ్రాబ్యాంకు,రాంకోఠి సావర్కర్ విగ్రహం మీదుగా నారాయణగూడ చౌరస్తా,దీపక్‌టాకీస్‌మీదుగా, చిక్కడపల్లి, ఆర్‌టిసి క్రాస్‌రోడ్డు, అశోక్‌నగర్‌బైబిల్ హౌజ్, మహంకాళీదేవాలయం, ప్యారడైజ్‌ల మీదుగా తాడ్‌బన్ హన్‌మాన్‌మందిరానికి శోభయాత్ర చేరుకుంటుందన్నారు. శాంతియుతంగా హన్‌మాన్ శోభయాత్రలో పాల్గొనవల్సిందిగా కోరారు.

## పంజాగుట్టలో స్పా ముసుగులో వ్యభిచారం

**20మందిని అరెస్ట్ చేసిన పోలీసులు**

హైదరాబాద్, ఏప్రిల్ 4,ప్రభాతవార్త: పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌పరిధిలో స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న స్పా సెంటర్‌పై పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 20మందిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు. అదుపులోకి తీసుకున్న వారిలో 10మంది మహిళలు, 10 మంది పురుషులు ఉన్నారని పోలీసులు తెలిపారు. బంజారాహిల్స్ రోడ్‌నెంబర్ 1లోని నవీన్‌నగర్‌లో ఏరోనాటిక్ బ్యూటీ స్పా పేరుతో వివిధ ప్రాంతాల నుంచి యువతులను తీసుకువచ్చి అసాంఘీక కార్యకాలాపాలు నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారంతో ఎస్‌ఓటి పోలీసులు దాడుల చేసి నిర్వాహకులతోపాటు యువతులు, యువకులను అరెస్ట్ చేశారు.

## స్వప్నలోక్ అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా



బాధిత కుటుంబసభ్యులకు చెక్కులు అందజేస్తున్న మంత్రులు తలసాని ,మమమూద్‌అలీ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 4,ప్రభాతవార్త: స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదం ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పశుసంవర్ధక ,మత్స్య పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గతనెల 16వ తేదీన సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు చెందిన 6గురు మరణించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొరికి 5లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం తరపున అందజేపస్తామని సిఎం కెసిఆర్ ప్రకటించారు. మంజూరైన చెక్కులను మంగళవారం మాసబ్ టాంక్‌లోని తన కార్యాలయంలో 6గురు మృతుల కుటుంబ సభ్యులకు మంత్రులు ,తలసాని, మహమూద్ అలీ, నర్సంపేట్ ఎమ్మెల్యే పద్ది సుదర్శన్‌రెడ్డి కలిసి అందజేశారు. ఈసందర్భంగా వారిని ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుల అంతా ఎంతో భవిష్యత్ ఉన్న చిన్నవయస్సు పిల్లలని విచారం వ్యక్తం చేశారు. సంఘటన పట్ల సిఎం కెసిఆర్ కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని తెలిపారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు అండగా ఉంటుందని వారిపై ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అమయ్‌కుమార్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ ఆర్డీఓ వసంత,తహసీల్దార్ శైలజ తదితరులు ఉన్నారు.

## చంపా దర్వాజ హనుమాన్ మందిరంలో హనుమాన్ జయంతి



దేవాలయాలలో శ్రీ హనుమాన్ జయంతి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

చార్మినార్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : హైకోర్టు చంపా దర్వాజ హనుమాన్ మందిరంలో ఈ నెల 6వ తేదీన అత్యంత వైభవంగా శ్రీ హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నామని మందిరం కమిటి ప్రతినిధులు తెలిపారు.చంపా దర్వాజా హనుమాన్ మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు జరుగుతాయని వారు తెలియజేశారు.గురువారం సాయంత్రం 5.01 గంటలకు చంపా దర్వాజ హనుమాన్ మందిరం నుంచి విశాల్ రథ యాత్ర ప్రారంభమై హైకోర్టు, నమాపూల్, మదీనా, రికాబ్‌గంజ్, బడ్‌కాజాడ్,ఘాన్సీ బజార్,సిటీ కళాశాల ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం తిరిగి మందిరానికి చేరుకుంటుందని వారు తెలిపారు. శోభాయాత్రలో పలు రకాల వేషధారణాలు ఉంటాయని,భక్తులు అధిక సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.కాగా పాతబస్తీలోని బండిఅడ్డ,కోకరివాడి, దూద్‌బౌలి,పురానాపూల్,తాడ్‌బన్,గౌలిపుర,అలియాబాద్,షంషేర్‌గంజ్‌తో పాటు పలు ప్రాంతాలలోని దేవాలయాలలో శ్రీ హనుమాన్ జయంతి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

# గాంధీలోకి మత్తు పదార్థాలు అనుమతించం

**ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు**



సిగరెట్‌లు, గుట్కాలు ధ్వంసం చేస్తున్న దృశ్యం

సికింద్రాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: రోగుల భద్రత తమకు సవాల్‌గా మారిందని, దీన్ని చిలకలగూడ పోలీసుల సహకారంతో పరిష్కరిస్తున్నామని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. గత కొన్ని రోజులుగా రోగులు, వారిని చూడడానికి వచ్చేవారి వద్దనుంచి స్వాధీనం చేసుకున్న మత్తుపానీయాలు, సిగరెట్‌లు, బీడీలు, గుట్కాలు, కల్లు, మద్యం లాంటివాటిని చిలకలగూడ పోలీసుల సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ఒక పెషెంట్ కోసం ఆరేడు మంది వస్తున్నారని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. తనిఖీలు జరిపే క్రమంలో సెక్యూరిటీ సిబ్బందిపై రోగుల అటెండర్లు దాడులు కూడా జరిపిన సంఘటనలు ఉన్నాయన్నారు. రోగులను చూసేందుకు వచ్చేవారు తమవెంట సిగరెట్‌లు, బీడీలు, గుట్కా ఇతర మత్తుపానియాలు తీసుకువస్తున్నారని, వాటిని అనుమతించకుంటే దౌర్జన్యం చేస్తున్నారన్నారు. రోగాలతో వచ్చిన వారికి మంచి వైద్యం అందజేసి వారిని ఆరోగ్యంతో ఇంటికి పంపాలనే లక్ష్యంతో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి తరుణంలో మద్యం మత్తులో సెక్యూరిటి సిబ్బంది, వైద్యులపై దౌర్జ్యం చేయడం సమంజసం కాదన్నారు. ఇలాంటివి జరుగకుండా పోలీసుల సహకారం తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యాక్రమంలో చిలకలగూడ సీఐ గోదేషి నరేష్, వైద్యులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ కార్పొరేటర్ రచనశ్రీ

ధర్నాచౌక్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు ఉన్నా పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠం వద్ద 21 లక్షల వ్యయం తో చేయతలపెట్టిన సెవరేజ్ పైప్‌లైన్ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ రచనశ్రీతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న స్టీల్ బ్రిడ్జ్ పనులలో భాగంగా పురాతన పైప్‌లైన్‌లను కూడా మార్చి, భవిష్యత్తులో ఎటువంటి డ్రైనేజి, మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చేపట్టిన పనులను వేగవంతం పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలుతీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు ముఠా జైసింహ, స్థానిక డివిజన్ అధ్యక్షులు వల్లాల శ్యాంయాదవ్, నాయకులు రాంచందర్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, సుధాకర్‌యాదవ్, ఎస్.యాదగిరి, రవీందర్, వల్లాల రవియాదవ్, శ్రీహరి, రాజేష్, కిరణ్, ప్రవీణ్, శ్రీధర్‌రెడ్డి, మాధవి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు మహేందర్‌బాబు, నాయకులు రమేష్‌రాం, వెంకటేష్, పరిమళ్‌కుమార్, జీహెచ్ఎంసీ అధికారులు డీఈ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సమస్యల పరిష్కారంలో అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంగా కృషి చేయాలి

**ఉపకమిషనర్ మంగ తాయారు**

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారంలో అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంగా పనిచేయాలని కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్ మంగ తాయారు అన్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంగతాయారు మాట్లాడుతూ ఈ నెల 11 నుండి జిహెచ్ఎంసిలో ప్రారంభమయ్యే పౌరుల ఫిర్యాదుల పరిష్కారం అనే కొత్త పథకంలో భాగంగా ప్రజలనుండి వివిధ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరిస్తుందన్నారు. ఆయా ప్రభుత్వ విభాగాలు ప్రజలనుండి వచ్చే వివిధ ఫిర్యాదుల పరిష్కారానికి సమన్వయంగా కృషిచేయాలని సూచించారు. ఈనెల 11న ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ విభాగాల నుండి విధిగా అధికారులు హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని సూచించారు. సమావేశంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎక్జిక్యూట్యూవ్ ఇంజనీరు కృష్ణచైతన్య, వివిధ విభాగాల అధికారులు హాజరై ప్రణాళికలపై చర్చించారు.

# ఆలయాల అభివృద్ధి కోసం కృషి

**వడ్డేపల్లి రాజేశ్వరరావు**



వడ్డేపల్లి రాజేశ్వరరావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి తనవంతు కృసి చేస్తానని టిటిడి బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యులు బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. బాలనగర్ డివిజన్ పరిధిలోని శ్రీ కళ్యాణ్ నగర్‌లో స్వయంభువుగా వెలసిన శ్రీ కట్ట మైసమ్మ ఆలయాల అభివృద్ధి పనుల కోసం సహకరించాల్సిందిగా కమిటీ సభ్యులు మంగళవారం వడ్డేపల్లిని కలిశారు. అనంతరం రాజేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మధు, ప్రధానకార్యదర్శి మనోహర్‌రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర్లు, అనిల్ సురేందర్‌రెడ్డి, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచితంగా 200మందికి కంటి అద్దాలు పంపిణీ



కంటి అద్దాలు అందచేస్తున్న బిఆర్ఎస్ నాయకులు గడ్డం అశీష్‌కుమార్‌యాదవ్

గన్‌ఫౌండ్రి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గంలో నిర్వహించిన బిఆర్ఎస్ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్ ఆయూష్ కేంద్రం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ద్వారా ఉచితంగా 200మందికి కంటి అద్దాలను అందచేశారు. గన్‌ఫౌండ్రి డివిజన్ పరిధిలోని పూల్‌బాగ్ కమ్యూనిటిహాల్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణి చేశామన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ కంటివెలుగు ద్వారా ఉచితంగా కంటి వైద్యపరీక్షలు జరిపించి కంటి అద్దాలు అందచేసిన ముఖ్యమంత్రి కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న గొప్ప అధినేత కెసిఆర్ అన్నారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# పాతబస్తీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు

**హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీకాంత్**



పురానాపూల్ డివిజన్ బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్

చార్మినార్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధిక ధరలతో ప్రజలపై భారం మోపుతుంటే, రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నదని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీకాంత్ అన్నారు. పాతబస్తీ పురానాహవేలిలో మంగళవారం చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అధ్యక్షతన జరిగిన పురానాపూల్ డివిజన్ బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి సాధించిందని తెలిపారు. రాష్ట్రంలో కోతలు లేని విద్యుత్ సరఫరాను చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసిఆర్‌కు దక్కిందని ఆయన తెలియజేశారు. పాతబస్తీలో కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బిఆర్ఎస్ ఘన విజయం సాధించ నున్నదని పుస్తె శ్రీ కాంత్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పురానాపూల్ డివిజన్ అధ్యక్షులు టి.రవీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ పెంద్యాల లక్ష్మణరావు, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్‌రావు, యేగేంద్రనాథ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## బహుజనుల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: బహుజనుల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయకుమార్‌గౌడ్ అన్నారు. చిక్కడపల్లిలోని కమిటీ కేంద్ర కార్యాలయంలో దళితబహుజన విప్లవవీరుడు సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్ 313వ వర్ధంతి సభ జరిగింది. బాలగౌని బాలరాజ్‌గౌడ్ మాట్లాడుతూ శ్రమజీవుల రాజ్యం స్థాపించినప్పుడే పాపన్నకు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.వి.రమణ పాల్గొన్నారు.

## సివరేజి పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభం

సికింద్రాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నాయకత్వంలో సనత్‌నగర్ నియోజకవర్గం అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించిందని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ హేమలత, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇంఛార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్‌లు తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌లో రూ. 5లక్షలతో చేపట్టిన సివరేజి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు లేకుండా చేసిన ఘనత మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌దే అన్నారు. రోడ్లు, పార్కులు కూడా ఎంతో అభివృద్ధి చెందాయని చెప్పారు. ఈ కార్యాక్రమంలో జలమండలి డీజీఎం వై. కృష్ణ, మేనేజర్ నవ్య, నేతలు రాజు, లక్ష్మీపతి, ప్రేమ్, సుధాకర్, ముక్కా శ్రీను, బాబురావు, జగదీష్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధులకు వారధిగా నిలిచేలా సంక్షేమ సంఘాలు ఉండాలి



కేసీఆర్‌నగర్‌లో నూతన కమిటీని అభినందిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : ప్రజలకు ప్రజా ప్రతినిధులకు వారధిగా నిలిచేలా సంక్షేమ సంఘాలు ఉండాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. మంగళవారం రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని కేసీఆర్‌నగర్‌లో నూతన కమిటీని ప్రకటించుకున్నారు. దీనికి ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొన్నారు. కమిటీని ప్రత్యేకంగా అభినందించారు. నూతన అధ్యక్షుడిగా వల్లపు మాధవ, ఉపాధ్యక్షులుగా ఎస్ సుధాకర్, జీ.రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డీ.రాము, ప్రధాన కార్యదర్శిగా ఎన్ ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దుర్గయ్య, కె.కుమార్, ఎమ్‌డీ కమృద్దీన్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా రమేష్, సీహెచ్ పరుశురాములు, కొమరయ్య, మల్లేష్, రాజు, డి.రాజు, డి.శంకర్ పాల్గొన్నారు.

## రైల్వే అధికారులు, సిబ్బందికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహణ



రైల్వే అధికారులు సిబ్బందికి ట్రాఫిక్‌పై అవగాహణ కల్పిస్తున్న టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు

తార్నాక, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: ట్రాఫిక్ రూల్స్‌పై మంగళవారం సాయంత్రం తార్నాక ప్రధాన రోడ్డులో ఉన్న ఇరిసెట్ ఆడిటోరియంలో బేగంపేట్ టీటీఐ ఏసీపీ శంకర్ రాజు పలువురి రైల్వే అధికారులు, సిబ్బందికి ట్రాఫిక్ రూల్స్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వార అవగాహణ కల్పించారు. ముఖ్యంగా స్టాప్ లైన్, రాంగ్ రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ లైటింగ్ వంటి ట్రాఫిక్ ఉల్లంగణలు చేస్తే ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో అనే అంశాలపై అవగాణ కల్పించారు. డ్రైవ్ చేసేసమయాల్లో దృష్టి, మనసు పూర్తిగా రోడ్డుపైనే లగ్నం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరు లైసన్స్ తీసుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్ద సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ సుధీర్ కుమార్, టీటీఐ ఎస్సై జ్యోతి, సిబ్బంది వెంకట ప్రసాద్, చక్రదర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## సుల్తాన్‌బజార్‌లో హన్‌మాన్ జయంతి వేడుకలు





బేగంబజార్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: ప్రశాంత వాతావరణంలో హన్‌మాన్ జయంతి ఉత్స జరుపుకోవాలని గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఈనెల 6వ తేదిన లక్ష్మి బజార్ హన్‌మాన్ ఉత్సవ సమితి ఆద్వర్యంలో నిర్వహించే హన్ మాన్ జయంతి ఉత్సవాలకు గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను రావాలని కోరారు. నిర్వాహకులు మేగ్యానాయక్, ఆశీష్, అనిల్, రాకేష్, శి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు



సమావేశంలో మాట్లాడుతున్న తహాశీల్దార్ ఫర్‌హీన్ షేక్

మెహిదీపట్నం, ఏప్రిల్ 4, ప్రభాత వార్త : ఇళ్ళ స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం గడువును పొడిగించిందని ఆసీఫ్‌నగర్ తహాశీల్దార్ ఫర్‌హీన్ షేక్ తెలిపారు. మంగళవారం ఆసీఫ్‌నగర్ తహాశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇళ్ళ స్థలాల క్రమబద్ధీకరణ కోసం గతంలో ప్రభుత్వం జీఓ.58, జీఓ 59లను జారీ చేసి ప్రభుత్వ స్థలాలు, సీలింగ్ భూములు, ఇతర ప్రభుత్వ సంస్థలలో ఇళ్ళు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. తాజాగా జీఓ.29 ద్వారా మరొక్కసారి ఇళ్ళ స్థలాల క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశాన్ని ఈనెల 30వరకు పొడిగించిందన్నారు. గతంలో స్వాధీన పత్రముల తేదిని-02-06-2014 నాటికి ఉండవలసి ఉండగా నేడు ఆ తేదిని-02-06-2020 వరకు వర్తించే విధంగా ప్రభుత్వం చివరి అవకాశం కల్పించిందన్నారు.

**గోల్కొండ తహాశీల్దార్ కార్యాలయంలో సమావేశం..** ఇళ్ళ స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం గడువును పొడిగించడంతో మంగళవారం గోల్కొండ తహాశీల్దార్ ఎస్.ఎం.హాసీనా ఆధ్వర్యంలో స్థానిక వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వం పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు మాతంగి రమేష్, ఇంద్రసేనారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నాగేంద్రప్రకాష్‌రెడ్డి, పూర్ణచందర్‌రావు, క్రిష్ణదాస్, జెన్న సుధాకర్‌లు పాల్గొన్నారు.

## పంజాగుట్టలో అంబేడ్కర్ విగ్రహం పున:ప్రతిష్ట హార్షణీయం

**మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య**



అంబేడ్కర్ విగ్రహం వద్ద చెన్నయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 4, ప్రభాత వార్త: పంజాగుట్ట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని పున:ప్రతిష్టించడం హార్షనీయమని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య అన్నారు. ఈమేరకు మంగళవారం పంజాగుట్ట విగ్రహ కమిటీ అధ్యక్షులు భాను ప్రకాశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాదారం వినయ్ కుమార్‌లతో కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని చౌరస్తాకు తీసుకొచ్చారు. ఈసందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ పంజాగుట్ట చౌరస్తాలో అబేద్కర్ విగ్రహాన్ని పున:ప్రతిష్టించాలని తాము చేస్తున్న ఉద్యమాన్ని గుర్తించి సానుకూల నిర్ణయం తీసుకున్నందుకు సిఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్, కొప్పుల ఈశ్వర్ , స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ విగ్రహ పున:ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని కావున దళిత సంఘాలు నేతలు అత్యధికంగా హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సరుగు రమేష్, సమతా సైనిక్యాల్, దాసరి లక్ష్మణ్, మేడి మధు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : శ్రీగణేష్



కంటోన్మెంట్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న శ్రీగణేష్

కంటోన్మెంట్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని ఎస్.జి.ఎఫ్.చైర్మన్, బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, మల్లేశం, రాజు, నర్సింహ్మా, శోభ, ముత్తయ్య, రేణుక, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే మాధవరం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని బాలాజీనగర్ డివిజన్ పరిధిలో దాదాపు 2 కోట్ల 50లక్షల రూపాయలతో బాలాజీనగర్, ఏపిహెచ్‌బి కాలనీ, ప్రగతినగర్, ముస్కిపేట్, ఖైత్లాపూర్‌లలో సిసిరోడ్ల పునరుద్ధరణ పనుల కొరకు, సీనియర్ సిటీజన్ భవనం కొరకు శంకుస్థాపనల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావుతో కలిసి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఈఈ సత్యనారాయణ, డిఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్, వర్క్ ఇన్స్‌పెక్టర్ శ్రావణ్, మాజీ కార్పొరేటర్ బాబురావు, ప్రభాకర్‌గౌడ్, వెంకటేష్‌చౌదరి పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ బోర్డులో పరశరాములు సేవలు మరువలేనివి



వి.ఆర్.ఎస్ తీసుకున్న పరశరాములును సన్మానిస్తున్న సిఈఓ మధుకర్ నాయక్, మాజీ వి.పి.జంపనప్రతాప్, బి.ఎన్.శ్రీను, ఆకుల మహేందర్

కంటోన్మెంట్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగులకు, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం 23 సంవత్సరాల పాటు పరశరాములు చేసిన సేవలు అమోగమని కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. బోర్డులో పనిచేస్తున్న యూడిసి ఏ.పరశరాములు సమాజ సేవకు, రాజకీయాల్లో రంగ ప్రవేశం చేసేందుకు తమ ఉద్యోగానికి విఆర్ఎస్ తీసుకున్న సందర్భంగా సోమవారం కంటోన్మెంట్ బోర్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కంటోన్మెంట్ బోర్డులో పనిచేస్తున్న గ్రూప్ డి ఎంప్లాయిస్‌కి హెల్త్ ఇన్సూరెన్స్, ఉద్యోగుల జీత భత్యాల పెరుగుదలకు ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. విఆర్ఎస్ తీసుకున్న పరశరాములు మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డును నా గుడి దేవుడిగా భావిస్తానన్నారు. కంటోన్మెంట్ ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకే తన ఉద్యోగానికి రాజీనామా చేశానన్నారు. ఇక నుంచి రాజకీయాల్లోకి వెళ్లి కంటోన్మెంట్ ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఈఓ విజయ్‌కుమార్ బాలన్ నాయర్, కంటోన్మెంట్ బోర్డుల్లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్‌లు గోపాల క్రిష్ణదాస్, ఎం.దేవేందర్, నర్సింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకుల మహేందర్, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్‌లతో పాటు బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరశరామ్‌కు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు

# ఆడ బిడ్డల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు అనుభవించాలి

**సీనియర్ కాంగ్రెస్ నేత పి.కృష్ణ**



ఖానాపూర్‌లో ఈవ్ టీజింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న షీటీమ్, జాగృతి కళాబృందం ప్రతినిధులు

నార్సింగి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ఆడ బిడ్డల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు అనుభవించాల్సి వస్తుందని గండిపేట్ మండల కాంగ్రెస్ సీనియర్ నేత పి.కృష్ణ పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఖానాపూర్ గ్రామంలో ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్స్, ఉమెన్ అండ్ చిల్డ్రెన్ సేఫ్టీ, బాల్య వివాహాలు, బాల కార్మికులు, బరోసా సెంటర్, ట్రాఫిక్ రూల్స్, డ్రగ్స్ వాడకం వంటి అంశాలపై షీటీమ్, జాగృతి కళా బృందం ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డలకు మంచి, చెడులపై అవగాహన కల్పించాలని సూచించారు. పరాయి స్త్రీని తల్లి, చెల్లిలాగా చూసుకునే సంస్కృతి భారత సంస్కృతి అని, దాన్ని మన బిడ్డలకు ఒంటబట్టించాల్సిన బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం దిశ వంటి చట్టాలు వచ్చాయని, ఆడ బిడ్డల జోలికెళ్తే జైలు జీవితం అనుభవించాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం షీటీమ్ ప్రతినిధి సంపత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రత పట్ల పోలీసు శాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన వద్ద షీటీంలను ఏర్పాటు చేసి మహిళలకు అండగా పోలీసు శాఖ నిలుస్తుందన్నారు. మహిళా పోలీసులు మఫ్టీల్లో బస్టాపులు, కళాశాలలు, సినిమాహాళ్లు, జనసంద్రం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో తిరుగుతూ పోకిరీలు, ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని శిక్షలు పడేలా చూస్తున్నారన్నారు. వందలాది మందిని అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వడం, అవసరమైతే జైలుకు పంపడం వంటి సంఘటనలు ఉన్నాయన్నారు. అనంతరం జాగృతి కళాబృందం సభ్యులు చట్ట విరుద్ధంగా నడుచుకుంటే కలిగే నష్టం గురించి పాటలు పాడి, నాటకం ఆడి ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో నిరంజన్‌గౌడ్, హరీష్, కోకిల, శ్రావణిలతో పాటు 150.మంది ఖానాపూర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్య వైశ్యులు అన్ని రంగాలలోను అభివృద్ధి సాధించాలి

**హైదరాబాద్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ నూతన అధ్యక్షులు సరాబు లక్ష్మణ్ గుప్త**



కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ నూతన కార్యవర్గం ప్రతినిధులు

చార్మినార్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ఆర్య వైశ్యులు అన్ని రంగాలలోను మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఎంతైనా ఉందని హైదరాబాద్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ కొత్త అధ్యక్షులు సరాబు లక్ష్మణ్ గుప్త అన్నారు. హైదరాబాద్ పాతబస్తీ గౌలిపుర ప్రాంతానికి చెందిన సరాబు లక్ష్మణ్ గుప్త హైదరాబాద్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. దూద్‌బౌలి వాసవి భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డి.ఆనంద్‌గుప్త ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రతినిధులను శాలువలు కప్పి మెమోంటోలు ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షులు సరాబు లక్ష్మణ్ గుప్త మాట్లాడుతూ మహాసభ ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి, 98వ సనాతన వేదాంత విజ్ఞార మహాసభ (2024), మెడికల్ హెల్త్ క్యాంపులు, విద్యార్థులకు నోట్ పుస్త కాలు పంపిణీ, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, విద్యార్థినీ, విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ పంపిణీతో పాటు పలు కార్యక్రమాలను నిర్వహించనన్నామని తెలిపారు. హైదరాబాద్ ఆర్య వైశ్య మహాసభ అభ్యున్నతి కోసం నూతన కార్యవర్గం అన్ని విధాల కృషి చేస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమం లో హైదరాబాద్ ఆర్య వైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కటకం శివకుమార్, కోశాధికారి లింగా ప్రకాష్, ఉపాధ్యక్షులు రేపాక వెంకటేశ్వర్లు, అదనపు ప్రధాన కార్యదర్శి కొక్కొల్ల సత్యం గుప్త, సహాయ కోశాధికారి చింతల్ ఘట్ శ్రీరామ్, పొలిటికల్ కమిటి చైర్మన్ దోరేటి ఆనంద్ గుప్త, మీడియా కమిటి చైర్మన్ గార్లపాటి ప్రభాకర్‌తో పాటు దూద్‌బౌలి ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమత్ కార్యసిద్ధి హోమం

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: భక్తులు తిలకిస్తుండగా, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమత్ కార్యసిద్ధి హోమాది కార్యక్రమాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ సీతారాముల వారి కల్యాణం, హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ జి.మురళీప్రసాద్, ఈవో మూచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ టి.రామకృష్ణ, రమణ, మురికి గణేష్, పద్మ బాసాని, అర్చకులు బుగ్గాలక్షీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, కె.కృష్ణమూర్తి, పురుషోత్తమచారి, ఎస్‌బివిఎన్.ఆచార్యులు పాల్గొన్నారు. 5న హనుమవ్రతం, 6న హనుమాన్ జయంతి, 7న సీతారాము కళ్యాణం ఉంటుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో ఆయా కార్యక్రమాలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని కోరారు.

## 48 గంటల నిర్విరామ సాహితీ బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: తెలుగు భాషా చైతన్యసమితి అధినేత బడేసాబ్, దర్పణం సాహిత్యవేదిక ఉపాధ్యక్షుడు రామకృష్ణచంద్రమౌళి ఆధ్వర్యంలో స్థానిక నల్లకుంట కార్యాలయంలో శ్రీశ్రీ కళావవేదదిక(తిరుపతి)లో నిర్వహించతలపెట్టిన 48 గంటల నిర్విరామ సాహితీ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కళావేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కట్ల భాగ్యలక్ష్మి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎర్ర సతీష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేయాలి: ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



కాలనీ వాసులతో ఎమ్మెల్యే

అల్వాల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: ప్రభుత్వ విభాగాలఉు సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే వెంకటాపురం డివిజన్ పరిధిలోని కమలాలయ ఎన్క్లేవ్ కాలనీలో కార్పొరేటర్లు సబిత అనిల్ కిషోర్ బుద్ధం నర్సింహయాదవ్ జిహెచ్ఎంసి అధికారులుతో పాటుగా పర్యటించడం జరిగింది. అల్వాల్ కూకట్పల్లి ప్రాంతాలు సరిహద్దుగా ఉన్న కాలనీలో సంవత్సరాలు కాలంగా డ్రైనేజీ వ్యవస్థ సమస్యగా ఉంది. ఇరు సర్కిళ్ళకు చెందిన అధికారులు ప్రజా ప్రతినిధులు సమక్షంలో సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించడం జరిగింది. బాక్స్ డ్రైన్ నిర్మాణంకు అవసరమైన నిధులు అందిస్తానని మైనంపల్లి హామీ ఇచ్చారు. వర్షా కాలం ప్రారంభం అయ్యే లోపు పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇ బాలక్రిష్ణ ఎఇలు అరుణ్ అరవింద్ బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్ భాస్కర్ శివ శ్యాంసుందర్ రఘునాథ్ ప్రభాకర్ మోసిన్ లక్ష్మి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య లేకుండా ప్రణాళిక: కార్పొరేటర్ జితేందర్‌నాథ్

అల్వాల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: మంచినీటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ తెలిపారు. మంగళవారం జలమండలి జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగాలుతో కలిసి ఐస్ ఫ్యాక్టరీ సాయి బృందావన్ ఎంహెచ్ఆర్ కాలనీ తదితర ప్రాంతాలులో కార్పొరేటర్ పర్యటించి మంచి నీటి పైపులైన్లు విస్తరణకు సంబంధించి చర్చించారు. ఆయా ప్రాంతాలో రోడ్లు నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపధ్యంలో ముందుగా మంచినీటి పైపు లైన్లు నిర్మాణం చేపట్టాలని అధికారులను జితేందర్‌నాథ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ చిన్నారెడ్డి డిఇ మహేష్ ఎఇలు రవళి స్వాతితో పాటుగా బిఆర్ఎస్ నేతలు సురేందర్‌రెడ్డి సుభాష్ గౌడ్ శ్రీశైలం ఆనంద్ రావు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో సాంస్కృతికోత్సవాలు



సాంస్కృతికోత్సవ వేడుకలో గానం చేస్తున్న సంగీత దర్శకుడు కోటి

నిజాంపేట్, ఏప్రిల్4 ప్రభాతవార్త: వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సిన్టిలేషన్స్ పేరుతో సాంస్కృతికోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సాంస్కృతికోత్సవ వేడుకలకు ముఖ్య అతిధులు గా చలన చిత్ర సంగీత దర్శకులు కోటి, నటుడు వంశీ చాగంటి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు కోటి మాట్లాడుతూ తాను పదహారేళ్ళ వయస్సులో గిటారిస్టుగా సంగీత ప్రస్థానం మొదటిపెట్టి 48ఏళ్లు పూర్తయ్యాయని, ఏ రంగంలోనైనా, జీవితంలోనైనా రాణించాలంటే సహనం, శ్రమ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, అంకిత భావం ఉండాలన్నారు. విద్యార్థులు, ఆహుతుల కోరిక మేరకు తాను స్వరపరచిన పాటలు పాడి విద్యార్థులతో పాటు అధ్యాపకులను ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధాన ఆచార్యుడు డా.సి.డి.నాయుడు, సంచాలకులు బి. చెన్నకేశవరావు, డా.వై.పద్మశాయి, విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## భూలక్ష్మిదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవానికి బండిసంజయ్‌కి ఆహ్వానం



బండి సంజయ్‌కు శ్రీభూలక్ష్మిదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవ ఆహ్వానపత్రికను అందిస్తున్న రామచంద్రారెడ్డి, మహాలక్ష్మి, శ్రీధర్

నాంపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : నారాయణగూడ గాంధీకుటీర్ వద్దనున్న శ్రీశ్రీశ్రీ భూలక్ష్మి దుర్గాదేవి ఆలయం 26వ వార్షికోత్సవాలను ఈ నెల 7, 8 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్న సందర్భంగా ఆ వార్షికోత్సవ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, అర్జున్‌సింగ్ తుజారామ్ తదితరులు స్వయంగా వెళ్లి ఆహ్వానించడం జరిగింది.

## ఓఆర్ఆర్‌పై ట్రాలీ పల్టీ.. డ్రైవర్‌కు గాయాలు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: టైర్ పంచర్ కావడంతో ఒట్రాలీ బోల్తాపడగా డ్రైవర్‌కు గాయాలైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జగద్గిర్‌గుట్ట రామకృష్ణనగర్‌కు చెందిన చంద్రశేఖర్ (31) కూకట్‌పల్లి నుంచి భువనగిరికి రంగుల డబ్బాలను వాహనంలో తరలిస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం ఉదయం ఘట్‌కేసర్ సమీపంలోని ఓఆర్ఆర్‌పై వద్దకు రాగానే అతను నడిపిస్తున్న అశోక్‌లీలాంగ్ ట్రాలీ (టిఎస్08యుడి-5542) వెనుక టైర్ పంచర్ కావడంతో ట్రాలీ ఒక్క సారిగా బోల్తా పడింది. దీంతో రంగుడబ్బాలన్ని కింద పడిపోగా డ్రైవర్ చంద్రశేఖర్ స్వల్ప గాయాలతో బయ టపడ్డాడు. ఘట్‌కేసర్ పోలీసులకు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించి సహాయక చర్యలు తీసుకున్నారని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ వి.అశోక్‌రెడ్డి తెలిపారు.

## కార్పొరేషన్ పరిధిలో నాయకుల పాదయాత్ర



పాదయాత్రలో స్థానికులతో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

నిజాంపేట్, ఏప్రిల్ 4 ప్రభాత వార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ వార్డు పరిధిలోని సాయికృష్ణ కాలనీ, చందు లే అవుట్, ఆర్‌కే లే అవుట్, ఎన్ఆర్ఐ కాలనీ, అపురూప కాలనీలో మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న డ్రైనేజీ, రోడ్డు, మంచినీటి సమస్య వంటి మౌ ళిక వసతులు కల్పించాలని ఎమ్మెల్సీకి విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ సంబందిత అధికారులతో చర్చించి సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడి, డిప్యూటీమేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఇంఛార్జి కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు చిట్ల దికవార్ శ్రీనివాస్ యాదవ్, బాలాజీ నాయక్, సురేష్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ ఆగం పాండు, బీఆర్ఎస్ నాయకులు రంగరాయప్రసాద్, దయాకర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, చందు, భాస్కర్, వెంగయ్యచౌదరి, జగన్‌యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, భౌరంపేట్ కౌన్సిలర్ మురళియాదవ్, అధికారులు, సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ప్రశ్నాపత్రాల లీకేజీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**

ధర్నాచౌక్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: మొన్న టీఎస్‌పీఎస్సీ, నేడు పదవ తరగతి ప్రశ్నా పత్రాల లీకేజీలకు ప్రభుత్వ అసమర్థతే కారణమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ధ్వజమెత్తారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ప్రశ్నాపత్రాల లీకేజీ ఆనవాయితీగా కొనసాగుతోందని విమర్శించారు. వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిన పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రభుత్వం ఉదాశీనంగా వ్యవహరించటం శోచనీయమని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రభుత్వం కవిత లిక్కర్ కేసుపై చూపిస్తున్న శ్రద్ధలో పదోవంతు ప్రశ్నాపత్రాల లీకేజీపై చూపిస్తే మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేవని అన్నారు. ప్రభుత్వ దళారుల వల్ల విద్యార్థుల శ్రమ బూడిద పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, లీకేజీలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల కిషోర్, ప్రధానకార్యదర్శి బాలరాజ్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి : లాస్య నందిత



రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న లాస్య నందిత తదితరులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 4 ప్రభాత వార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత తెలిపారు. మంగళవారం కంటోన్మెంట్ మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్, ఈస్ట్ మారేడ్‌పల్లి, ఎల్.శంకర్ నగర్, శివాజీ నగర్, దొక్కలమ్మ గుడి, పెరుమాల్ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ తన తండ్రి ఆలోచన విధానంలో కంటోన్మెంట్ ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తామన్నారు. ఎవరకి ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తెచ్చినట్లైతే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ బత్తుల నారాయణ, దేవులపల్లి శ్రీను, భాస్కర్ ముదిరాజ్, మోండా డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరిక్రిష్ణ, బిఆర్ఎస్ నాయకులు నివేదిత, పనస సంతోష్, ఎస్.రాము, నీరజ్, నాగినేని సరిత, గౌరి శంకర్, శేఖర్ ముదిరాజ్, కాశిరెడ్డి, దాసరి కర్ణకుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబర్‌పేటలో హ్యాట్రిక్ విజయానికి సన్నద్ధం కావాలి: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



ఆరే మైసమ్మ ఆలయం వద్ద జరిగిన కాచిగూడ డివిజన్ బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : సిఎం కెసిఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రోజురోజుకు ప్రజల్లో మరింత ప్రజాదరణ పెరుగుతోందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం ఆరే మైసమ్మ ఆలయం వద్ద జరిగిన కాచిగూడ డివిజన్ బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎవరూ ఊహించని విధంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి ఎప్పటికప్పుడు కొత్త పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న అనేక సంక్షేమ పథకాల కారణంగా గతంలో ఎన్నడూ లేనంతగా ఆర్థిక భరోసా కనిపిస్తోందన్నారు. కార్యకర్తలు ఉత్సాహంతో పనిచేసి రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయానికి సన్నద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ప్రతి నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు భీష్మ, పార్టీ సీనియర్ నేతలు దిడ్డి రాంబాబు, డాక్టర్ ఓంప్రకాష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్రతో సమస్యల పరిష్కారం



రాజీవ్‌గాంధీనగర్‌లో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు బస్తీల కాలనీలలో పాదయాత్రలు నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకోవటం జరుగుతుందని కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో ఏ బ్లాక్ నుంచి బీ బ్లాక్ వరకు పాదయాత్ర చేశారు. బస్తీలో ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని అదేవిధంగా పాత కేబుల్స్ కిందికి జారి ఉండటం వల్ల ప్రమాదకరంగా ఉన్నాయని వాటి స్థానంలో కొత్త వైర్లను ఏర్పాటు చేయాలన్నారు. తొందర్లోనే వారి దృష్టికి వచ్చిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా త్వరలో పూర్తిచేస్తామనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి గౌసుద్దీన్, డీఈ అంబేద్కర్, ఏఈ శంకర్, రమేష్, రాంబాబు, అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీ సభ్యునిగా లక్ష్మణ్ ఎన్నికపై ఎంపిపి హర్షం

ఘట్‌కేసర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: రాజ్యసభసభ్యులు, బిజెపి జాతీయ ఓబీసీ మోర్చ అధ్యక్షులు డాక్టర్ కోవ లక్ష్మణ్ పీఏసీ సభ్యులుగా ఎన్నిక కావడం పట్ల ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హైదరాబాద్‌లో ఆయన ఎంపీ లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. లక్ష్మణ్ పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి అధిష్టానం పలు బాధ్యతలు అప్పగిస్తుందని ఎంపిపి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు కొమ్మిడి శోభారాణి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభ కనబర్చాలి



చెస్ ఛాంపియన్ ట్రోఫీని అందజేస్తున్న జంపనప్రతాప్

అడ్డగుట్ట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభకనబర్చాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. తెలంగాణ చెస్ అసోసియేషన్, మేడ్చల్ జిల్లా చెస్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ చెస్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన అండర్ -17 బాలబాలికల చెస్ ఛాంపియన్ పోటీల్లో బాలికల విభాగంలో ఎస్.వి. జైన్, ప్రనేయ్ ఆకుల చెస్ ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో బోయిన్‌పల్లిలోని సిఎంఆర్ హై స్కూల్ ప్రాంగణంలో జరిగిన పోటీల్లో 52 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విజేతలకు జంపన ప్రతాప్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ప్రతినిధులు బి.ప్రసాద్, సి.ఎం. ఆర్.స్పోర్ట్స్ అకాడమీ కోచ్ సుధీర్, పియిటీలు దాస్, శ్రీధర్ యాదవ్, రాజేశ్‌కుమార్, లలిత, వాని,జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు విద్యాశాఖ మంత్రి పలకరింపు

సరూర్‌నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: పరీక్షలు రాసి బయటకు వచ్చిన టెన్త్ విద్యార్థులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పలకరించారు. మహేశ్వరం నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాలకు మంగళవారం మధ్యాహ్నం వెళ్తున్న మంత్రికి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాల కేంద్రంలో పరీక్ష రాసి ఇళ్ళకు వెళ్తున్న విద్యార్థినిలను గమనించారు. ఈ నేపథ్యంలో తాను కాన్వాయ్‌ను ఆపించిన మంత్రి విద్యార్థుల వద్దకు వెళ్ళి పరీక్షలు ఎలా రాసారని అడిగి తెలుసుకున్నారు. దీంతో బాగా రాసామని చెప్పిన బాలికలను ఇష్టపడి చదవాలని మంత్రి ప్రోత్సహించారు.

## రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

శామీర్‌పేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : కొల్తూర్ గ్రామ సమీపంలోని జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కూలి మృతిచెందారు. నడుచుకుంటూ వెళ్తున్న కూలీని వెనక నుంచి క్రేన్ ఢీకొనటంతో అక్కడికక్కడే ఆ కూలీ మృతిచెందారు. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం పచ్చిమ బెంగాల్ రాష్ట్రంకు చెందిన హేమ్‌లాల్ హేమ్‌రామ్ (30) కూలీ పని కోసం కొల్తూర్ గ్రామానికి వచ్చి అతని స్నేహితుడు ఎండి రాఖుల్‌హుస్సేన్ వద్ద ఉంటునట్లు పోలీసులు తెలిపారు. అయితే మంగళవారం ఉదయం 9గంటల సమయంలో బిఇ కంపెనీ వైపున నుంచి కొల్తూర్ గ్రామానికి కూలీ హేమ్‌లాల్ హేమ్‌రామ్ నడుచుకుంటూ వస్తున్నట్లు తెలిపారు. అయితే కొల్తూర్ గ్రామ సమీపంలో ఉన్న శ్రీపెద్దమ్మ ఆలయం వద్దకు చేరుకోగానే రోడ్డున కూలీ హేమ్‌లాల్ హేమ్‌రామ్ నడుచుకుంటూ వెళ్తుండగ వెనక నుంచి క్రేన్ వెహికిల్ (వాహనం) డ్రైవర్ అజాగ్రత్తగ, అతివేగంగ నడుపుతూ నడుచుకుంటూ వెళ్తున్న ఆ కూలీని వెనక నుంచి క్రేన్ ఢీకొనటంతో ఆ కూలీ అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఆ కూలీ కడపుపై నుంచి క్రేన్ వెళ్లటంతో కూలీ అక్కడికక్కడే మృతిచెందినట్లు అతని స్నేహితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## జీవో 58,59ల అమలుకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తాం

**జవహర్‌నగర్ ఎస్సార్టీ, టిఆర్టీ కాలనీ వాసులు**



హిమాయత్‌నగర్ ఎమ్మార్వో చంద్రకళను కలిసిన జవహర్‌నగర్ ఎస్సార్టీ, టిఆర్టీ కాలనీ వాసులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 58,59ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని జవహర్‌నగర్ ఎస్సార్టీ, టిఆర్టీ కాలనీ వాసులు హామీఇచ్చారు. ఈ మేరకు మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని హిమాయత్‌నగర్ తహశీల్దార్ చంద్రకళను కాలనీ వాసులు మారిశెట్టి నర్సింగరావు, నర్మెట్ట మల్లేష్, నాయుడు రవి, నాగెళ్ళ కృష్ణ, సిహెచ్.సాయిలు, కుమారస్వామి, దేవయ్య, నవీన్, ఖాజాబాబా, ఆకాశ్, రాజు తదితరులున్నారు. జీవోలను అనుసరించి 100 శాతం మార్కెట్ వాల్యూ చెల్లించాలని తమకు నోటీసులను ప్రభుత్వం జారీ చేసినందుకు తహశీల్దార్‌ను కలిశామని పేర్కొన్నారు. 100 నుంచి 150 గజాల వరకు 25శాతం మార్కెట్ వాల్యూ చెల్లించాలని, 150 నుంచి 300 వరకు 50శాతం, 200 నుంచి 300 వరకు 75శాతం, 300 నుంచి 500 వరకు 100శాతం మార్కెట్ వాల్యూ చెల్లించాలని జీవో చెబుతోందని, కాని సంబంధిత అధికారులు తమ ఇష్టానుసారంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చే విధంగా చర్యలకు ఉపక్రమిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి వాటికి స్వస్తి పలకాలని అన్నారు. ఈ జీవో అమలుతో పాటు అన్ని విధాలుగా ప్రభుత్వానికి సహకరించడానికి సిద్దంగా ఉన్నామన్నారు.

## కంటివెలుగు సెంటర్ పరిశీలన



కంటివెలుగు సెంటర్‌ను పరిశీలిస్తున్న డా. వెంకటి, డా. పద్మజ, డా. మనోజ్‌రెడ్డి, డా. మాధవి తదితరులు

నాంపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించిన కాచిగూడ మున్నూరుకాపు హెల్త్ సెంటర్‌ను ఎస్‌పిహెచ్ఓ డా. పద్మజాతో కలిసి హైదరాబాద్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డా. వెంకటి మంగళవారం దర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ కంటి వెలుగు సెంటర్‌లో 4460 కేసులను పరిశీలించడం జరిగిందని, 1685 రీడింగ్ కంటి అద్దాలను, ప్రిస్కైబ్ చేసిన 694లో 447 కంటి అద్దాలను అందజేయడం, 1226 ప్రిస్కైబ్ కంటి అద్దాలకు ఆర్డర్ చేయడం జరిగిందని ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ డాక్టర్ మాధవి, ఆప్టోమెట్రిస్ట్ రాజు, డిఈఓ అమేరీన్, ఎఎన్ఎం సుహాసిని, ఆశావర్కర్లు జమున, లిఖిత, మాధవి, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌కు మోడీ రానున్న సందర్భంగా బిజెపి నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్ ఆధ్వర్యంలో అమీర్‌పేటలో జరిగిన సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ఎన్‌డిఎంఎం

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కొర్రెముల దళితులు మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చౌదరిగూడ సర్వేనంబర్ 869 ప్రభుత్వభూమిలోని 11-32 ఎకరాల భూమి 9 మంది దళిత కుటుంబాలకు వ్యవసాయం చేసుకోవడానికి కేటాయించారని తెలిపారు. ఈభూమి గత కొంతకాలంగా వివాదంతో కోర్టులో కేసు నడుస్తుండగా కొందరు రైతులు కోర్టు ఆదేశాలను సైతం లెక్క చేయకుండా రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి రాత్రికి రాత్రి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొన్నారు. కట్టడాలపై ప్రశ్నిస్తే దళిత రైతులపై దాడులకు పాల్పడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోయారు. అధికారుల నిర్లక్ష్య ధోరణితో 869 సర్వేనంబర్‌లో అక్రమ నిర్మాణాలు యధేచ్ఛగా సాగుతున్నాయని వీటిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మేదరి నాగలక్ష్మి, అమృత, దేవమ్మ, జువ్వ రాజు, నర్సమ్మ, కమలమ్మ, జంగయ్య, పెంటమ్మ, సురేశ్, యాదగిరి, ప్రకాష్, సుజాతలు ఉన్నారు.

## లోఓల్టేజీతో విద్యుత్ పరికరాలు దగ్ధం

ఘట్‌కేసర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: విద్యుత్ లోఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం అయ్యాయని పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్ బి-1 కాలనీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పీజులు కాలిపోయి ఇళ్లలోకి హై, లోఓల్టేజీ సరఫరా అయ్యిందని తెలిపారు. వేసవికాలంలో విద్యుత్ వినియోగం పెరిగిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక భారం పడుతుందనని పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బందికి పలుసార్లు తెలియజేసినా కరెంట్ సమస్యలు తీరడం లేదని వాపోయారు. బి-1 కాలనీలోని ఇళ్లలో కంప్యూటర్లు, ఇతర గృహోపకరణాలు కాలిపోయి ఆర్థికంగా నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ GHMC
సరూర్‌నగర్ సర్కిల్-5

నిట్ నెం.1/EE5/SRNR/GHMC/2023-24, తేదీ: 03.04.2023, పని పేరు: (07) నెం.ల సివిల్ పనులు, అంచనా విలువ: రూ.192.20 లక్షలు, బిడ్‌ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయము: 11.04.2023న మ.3.01 గం.లు, అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నెం: శ్రీ కె. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC, మొబైల్: 9989930602. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.eprocurement.telangana.gov.in పై చూడవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC
DIPR.No.16-PP/CL/Advt/1/2023-24, తేదీ: 04.04.2023

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ GHMC
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

నిట్ సం.: 63/EE/CIR-20/SLPZ/GHMC/1-12/2023-24 తేది: 03.04.2023.
పని యొక్క రకం : సివిల్ పనులు (12) అంచనా మొత్తం (రూ.లక్షలలో) 365.50. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 04.04.2023 మ.1.30గం. 17.04.2023 మ.1.30గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నెం.: EE, CIR-20, SLPZ, GHMC 9849906745.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-20, GHMC.
DIPR.No.14214-PP/CL/Advt/1/2023-24 తేదీ: 04.04.2023

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ GHMC
సంక్షిప్త టెండర్ ప్రకటన

నిట్ నం.: 01/EEC-4/LBNR/GHMC/2023-24 తేది: 01.04.2023.
పనిపేరు: 5నం. నిర్వహణ పనులు. అంచనా మొత్తం: రూ. 18.90 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ/చివరి తేదీ, సమయం: 03.04.2023 సా.4.00గం. 06.04.2023 సా.4.00గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నెం: శ్రీ డి.కోటేశ్వరరావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బి నగర్, సర్కిల్-4, GHMC (M) 9989094468. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://tender.telangana.gov.in పై చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్.బి.నగర్ సర్కిల్-4, GHMC.
DIPR.No.14223-PP/CL/Advt/1/2023-24 తేదీ: 04.04.2023

PUBLIC NOTICE

The General public are hereby informed that our client entered into an agreement of sale with **1) Sri. Maheshwar Raj Saxena** S/o late Jagdish Prasad Saxena, (Aadhar Card No.9388 7374 0283) **2) Sri. Mukeshwar Raj Saxena** S/o late Jagdish Prasad Saxena, (Aadhar Card No.6094 0224 7798) both 1 and 2 are R/o. H.No.20-2-208/1, Hussaini Alam, Old Kabutar Khana, Bahadurpura, Hyderabad, and **3) Sri. Rakesh Chander Saxena** S/o late Jagdish Prasad Saxena, R/o Presently residing at 54 Austin Road, Woodley, Reading RG5 4EL, U.K. Rep. by his GPA Holder Sri. Maheshwar Raj Saxena S/o late Jagdish Prasad Saxena, for the purchase of their owned & possessed All that the part and parcel of Shop/Mulgi with Room at Ground Floor for commercial purpose and three upper floors for Residential purpose bearing Municipal No.19-1-347/4 (PTIN No. 1051921677), admeasuring (35.00) Square yards equivalent to (29.26) Square meters, situated at Chatakni Pura, Outside Doodh Bowli, Hyderabad, A.P., and Bounded by: North: Road, South: Neighbour's Property, East: Neighbour's House No.19-1-347, 347/1 to 347/3, West: Neighbour's House. under Agreement of Sale and also paid substantial amount to them.
If any person(s) are having any objection, claim, interest or title in the said property may contact the under signed along with all title deeds, and relevant papers within 7 (Seven) Days from the date of publication of this notice, otherwise the sale transaction will be completed as per schedule and there after no claim will be entertained.
**Sd/- ASHOK KUMAR AGARWAL**
**SYED ABDUL MAJID**
**Miss. KHUSHBOO AGARWAL**
**Advocates**
Office at: 21-7-588 & 588/4/A, Kokarwadi, Ghansi Bazar, Hyderabad,
Phone: 9849224518

IN THE COURT OF THE III SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT SECUNDERABAD
O.P.No. 6 of 2023
Between:
**SHYAM LAL ASRANI & ANOTHER** ...Petitioners
AND
**ALL CONCERNED** ...Respondents
To
**All Concerned**
**NOTICE**
Please take notice that the above O.P.No.6 of 2023 on the file of III Senior Civil Judge, City Civil Court at Secunderabad, has been filed by my clients **1) Shyam Lal Asrani and 2) Madhu Chhabria**, for the grant of succession certificate in respect of amounts held by the deceased Atmaram Asrani in the Savings Bank Account amounting to Rs.3,00,94,592.50/-, fixed deposits amounting to Rs.60,88,037.94 and Bank Locker bearing No.450 in Canara Bank Picket Branch, Secunderabad. The said O.P. stands posted to 27th April 2023. Any persons having any objection/s, may appear before the Hon'ble Court either in person or through an advocate on 27th April 2023 at 10.30 am, failing which the matter would be decided as per law.
(By the Order of III Senior Civil Judge, City Civil Court, Secunderabad)
**Sd/- ADNAN MAHMOOD**
**ZEESHAN ADNAN MAHMOOD**
**(Advocates)**
**Mahmood & Co. Advocates**
No.1-7-347 to 349, 2nd Floor, Suite 'A', Mahmood Chenoy Complex Parklane, Secunderabad-500003.

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME
★ నేను నీతు కుమారి రైనా W/o. కుల్‌దీప్ భాన్ R/o. ఫ్లాట్ 104, సాయికిషోర్ రెసిడెన్సీ, రోడ్ నెం.4, బాలాజీనగర్, మణికొండ పుప్పాలగూడ, హైదరాబాద్, తెలంగాణ 500089. పాస్‌పోర్టును పొందడానికి, నా పేరు నీతు రైనాగా సవరింపుతో కరెక్ట్ చేసుకొన్నాను.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# వివాదాస్పదమైన రోడ్డు విస్తరణ పనుల శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.9 కోట్ల హెచ్ఎండిఎ నిధులతో మంగళవారం చేపట్టిన రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ప్రొటోకాల్ రగడ జరిగింది. కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ శ్రీనిలయ కమాన్ ఆర్అండ్‌బి రోడ్డు నుండి నాదర్‌గుల్ జడ్పీహెచ్ఎస్‌వరకు నిర్మించనున్న రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల కు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు నిమ్మల సునీతశ్రీకాంత్‌గౌడ్, తోట శ్రీధర్‌రెడ్డి, గూడెపు ఇంద్రసేన, సూర్లగంటి అర్జున్, కో-ఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్‌రెడ్డి, భాగ్యనగర్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి తదితరులతో కలిసి భూమి పూజ చేసి శ్రీకారం

## బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ప్రొటోకాల్ రగడ

చుట్టారు. శంకుస్థాపన జరిగిన అనంతరం అక్కడ ప్రొటోకాల్ వివాదం జరిగింది. రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి మంత్రి వెళ్ళిన తర్వాత అక్కడికి వచ్చిన బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి భగ్గుమన్నారు. కార్పొరేషన్ కాంగ్రెస్ పక్ష నాయకుడు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పలువురితో కలిసి అక్కడికి చేరుకున్న ఆమె మంత్రి సబితారెడ్డి, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డిలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

**ప్రొటోకాల్ పాటించరా?: మేయర్ పారిజాత...** కార్పొరేషన్‌లో జరుగుతున్న రోడ్డువిస్తరణ పనుల శంకుస్థాపనలో ప్రొటోకాల్ పాటించకపోవడాన్ని మేయర్ పారిజాత ప్రశ్నించారు. శంకుస్థాపన జరిగిన ప్రాంతానికి చేరుకున్న ఆమె మంత్రి సబితారెడ్డిపై ధ్వజమెత్తారు. తాను రాకుండా శంకుస్థాపన చేయడంపై అసహనం వ్యక్తం చేసిన ఆమె కార్పొరేషన్‌లో ఇక మేయర్ ఎందుకని ప్రశ్నిం చారు. కమీషనర్ అధికార పార్టీకి, మంత్రికి తొత్తుగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. శంకుస్థాపన కోసం తాను పది గంటల నుండి కార్పొరేషన్ కార్యాలయంలో ఎదురు చూశానని అయితే మొత్తానికి తాను రాకుండానే శంకుస్థాపన చేశారని ఆమె మండిపడ్డారు. బడంగ్‌పేట్ శ్రీనిలయ ప్రాంతంలో చేయాల్సిన శంకుస్థాపనను నాదర్‌గుల్‌లో చేయడం తనకు సమాచారం లేదని అన్నారు. అయితే అసంతృప్తితో ఉన్న మేయర్‌చే కొబ్బరికాయ కొట్టించడానికి బిజెపి కార్పొరేటర్లు ప్రయత్నించినా ఆమె ససేమిరా అన్నారు.

## పేదల మేలు కోరుతూ సిఎం కెసిఆర్ జీవో 58, 59 విడుదల : మంత్రి సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** ఇల్లులేని ప్రతి పేదవాడికి సంవత్సరా లుగా ప్రభుత్వస్థలాలలో నివాసం ఉంటున్న వారికి జీవో నెంబర్ 58, 59తో సిఎం కేసీఆర్ ఎంతో లబ్ధి చేకూర్చాలని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ మండల కార్యాలయంలో మంగళవారం 95మంది లబ్ధిదారులకు పట్టాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్, శంకర్‌నగర్, అంబేద్కర్‌నగర్‌లలో కొన్నేళ్లుగా నివసిస్తున్నవారికి పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని, ఏ కారణంచేతనైనా దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు తిరస్కరిస్తే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ నెల చివరి వరకు సిఎం కేసీఆర్ సమయం ఇచ్చారని ఈ అవకాశాన్ని పేదలు ఉపయోగించుకొని లబ్ధి పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్ గుప్తా, ఎగ్గే మల్లేశం, కందుకూర్ ఆర్డీవో సూరజ్, తహసిల్దార్ జయశ్రీ, నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, సాజిద్, రాఘవేంద్రగుప్తా, సుదర్శన్, మహమ్మద్‌సలీం, ఋషి పాల్గొన్నారు.

## విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలి : ప్రిన్సిపల్ దిలీప్‌రెడ్డి



ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ దిలీప్‌రెడ్డి

**మలక్‌పేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత ను వెలికితీయడానికి కృషి చేస్తున్నామని శ్రీ సాయి డిగ్రీ, పిజి కళాశాల ప్రిన్సి పల్ దిలీప్‌రెడ్డి పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్‌లోని తమ కళాశాలలో నిర్వహించి న ఫుడ్ ఫెస్టివల్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని అంశా లపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆహార పదారాల ప్రాధాన్యతగురించి తెలియజేయడానికి ఫుడ్ ఫెస్టివల్స్ దోహదపడతాయన్నారు. విద్యార్థులు ప్రద ర్శించిన వివిధ రకాల వంటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో వైస్‌ప్రిన్సిపల్ శ్రీనివాసాచార్యులు, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, ప్రసాద్, సీత, శోభ, షర్మిల, అన్నపూర్ణ, అపర్ణ, జ్యోతి, లావణ్య, వినీల, మమత, మేధ, సుష్మ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం నిరంతరం ఏఐటీయూసీ పోరాటం : యాదిరెడ్డి




కార్యక్రమంలో మాట్లాడుతున్న యాదిరెడ్డి

**హయత్‌నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఏఐటీయూ సీ తనవంతు పాత్ర పోషించిందని, 75 సంవత్సరాలుగా కార్మికుల హక్కుల కోసం శ్రమజీవుల తరపున పోరాడుతోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని వెంకటేశ్వర కాలనీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన అటోనగర్ అడ్డా ఇసుక, డస్ట్ అన్‌లోడింగ్ కార్మి కుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడుతున్న సంఘంలో చేరడం శుభపరిణామమన్నారు. కార్మికుల ఆర్థిక పరిస్థితులు, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యార్థుల ఫీజుల ను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యాలు కష్టానికి తగిన విధంగా వేతనాన్ని అందించాలన్నారు. రెండువేల పైచిలుకు కుటుంబాలు ఇసుక అన్‌లోడింగ్ మీద ఆధారపడి ఉన్నాయని, వారికి అడ్డామీద కనీస వసతులు కల్పించాలని కోరారు. సంఘంలో చేరిన కార్మికులు సంక్షేమ బోర్డులో తమపేరును నమోదు చేసుకుని ఇన్సు రెన్సు కార్డును పొందాలని సూచించారు. రమావత్ సక్రు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు సామిడి శేఖర్‌రెడ్డి, హరిసింగ్‌నాయక్, గూడ సోమయ్య, ఇరుగు వెంకన్న పాల్గొన్నారు.

## అభివృద్దే తమ ధ్యేయం : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** అభివృద్దే తమ ధ్యేయమని మూసారాం బాగ్‌డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని గాయత్రి అపార్ట్‌మెంట్స్ వద్ద సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం ఇంద్రనగర్ కమ్యూనిటీ హాల్‌వద్ద జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నిత్యం డివిజన్‌లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, చందు, కొప్పుల దినేష్, వంశీ, నవీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడి నృత్యంలో అతి చిన్న వయసులో గంధం కృష్ణయుక్తకు బాలరత్న నంది అవార్డు




చిన్నారి కృష్ణయుక్తకు బాలరత్న నంది అవార్డు అందజేస్తున్న ప్రముఖులు

**వనస్థలిపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** శ్రీమతి విద్యా రత్న భింగి మల్లేశ్వరి మెమోరియల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు 2023 నిర్వహించారు. ఈ సందర్భంగా కూచిపూడి నృత్యంలో అతి చిన్న వయసులో వినూత్నంగా రాణిస్తున్న బేబీ గంధం కృష్ణయుక్తను బాలరత్న నంది అవార్డుతో సత్కరించా రు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ నీటిపారుదల శాఖ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి, స్టేట్ టూరిజం డెవలప్‌మెం ట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, బింగి మల్లేశ్వరి మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బింగి నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధనలో భాగస్వాములైన ప్రముఖులు గంటా ముత్యాలుయాదవ్, పంతులు విట్టల్‌రావు, దామోదర్‌రెడ్డి పందెం, బొందుగుల ఉపేందర్‌రెడ్డి, పతంగి గోపాల్‌లను ఉగాది పురస్కార గ్రహీతలుగా ప్రకటించి సన్మానించారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి ప్రసంగిస్తూ అతి చిన్న వయసులోనే కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచిన కుమారి కృష్ణయుక్తకు ఉజ్వల భవిష్యత్తు ఉందని పాపను తీర్చిదిద్దినందుకు గురువు డాక్టర్ కృష్ణప్రియను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల ప్రకాష్‌గౌడ్ కవిత దంపతులు, బండారి బ్రదర్స్ పాల్గొన్నారు.

## అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తే సహించేది లేదు : బిఆర్ఎస్



మూసి ప్రాంతంలో పర్యటిస్తున్న టిఆర్ఎస్ నాయకులు

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** మూసీ నది ప్రక్షాళనకు సంబంధించి బిజెపి నాయకులు అవగాహన లేకుండా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై అవాకులు చివాకులు పేలుతున్నారని చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు తోట మహేష్‌యాదవ్, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసి నది చైర్మన్‌గా పదవి బాధ్యతలు ముగిసి 2 నెలలైందని, ఆ సంగతి తెలియకుండా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం బిజెపి నాయకుల అజ్ఞానానికి నిదర్శనమ న్నారు. మూసీనదిని 2025నాటికి బ్రహ్మాండంగా తీర్చిదిద్దుతామని, ప్రణాళిక సిద్ధం చేశామని, సుందరకరణలో ఒక శాతం మాత్రమే అభివృద్ధి జరిగిందని, ఇంకా 99శాతం 2025 నాటికి పూర్తవుతుందని ఎమ్మెల్యే ప్రకటించిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. సుమారు రూ.14వేల కోట్లతో మూసినది ప్రక్షాళన సెప్టెంబర్ నాటికి టెండర్లు పిలవడం జరుగుతుందని తెలిపారు. రూ.500 కోట్లు కేంద్రం నుంచి ఇప్పించే దమ్ము బిజెపి నాయకులకు ఉందా అని సవాలు విసిరారు. మూసీ ఒడ్డుకి నువ్వు వెళ్లడానికి ఎమ్మెల్యే చేసినా అభివృద్ధి అని గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శరత్‌చంద్ర, జయశ్రీ, మోహన్‌రాజ్, సుధాకర్, ప్రవీణ్‌చారీ, జలంధర్, కృష్ణ, బొట్టు నిఖిల్, మధు, గణేష్ పాల్గొన్నారు.

## ప్రజలను మభ్యపెట్టే విధంగా బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు: చల్లా నర్సింహారెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు ప్రజల ను మభ్యపెట్టేవిధంగా ఉన్నాయని రంగారెడ్డిజిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం మంద మల్లమ్మ చౌరస్తా సమీపంలోని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపి స్తున్న నేపథ్యంలో మరోసారి ప్రజలను మోసంచేయడానికి బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తున్నట్లుగా ఉందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం లోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో బిఆర్ఎస్ వారి ఆత్మీయ సమ్మేళనాలను గమనిస్తే పగటి వేషగాళ్లు ప్రజల మధ్యకు వచ్చినట్లుగా ఉందని ఆయన పేర్కొన్నారు. సమ్మేళనాలకు వస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు ఇస్తున్న హామీలు ఆరు నెలల్లో నెరవేర్చే సూచనలే లేవని ఆయన స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల పేర్లు చెప్పుకుని వస్తున్న వారికి ప్రజల సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయని అర్థం అవుతున్నదని ఆయన అన్నారు. అయితే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్న బిఆర్ఎస్ చేతిలో ప్రజలు మోసం పోవడానికి సిద్ధం లేరని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, ఎరుకల వెంకటేష్‌గౌడ్, కీసర యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇంటి స్థలాలు క్రమబద్ధీకరిస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌దే: మంత్రి సబితారెడ్డి



క్రమబద్ధీకరణ పట్టాలను అందజేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** ప్రభుత్వ స్థలాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్ళను క్రమబద్ధీకరిస్తున్న ఘనత కేవలం బిఆర్ఎస్‌కే దక్కుతుందని రాష్ట్ర విద్యాశాఖమంత్రి పి.సబితాఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజక వర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ దాసరి నారాయణ రావుకాలనీ, కమలానగర్ నెహ్రూనగర్ తదితర వీకర్‌సెక్షన్ కాలనీలకు చెందిన పలువురు పేదల నివాసాలను జిఓ నెంబర్ 58 ప్రకారం క్రమబద్ధీకరించిన నేపథ్యంలో పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సబితా ఇంద్రారెడ్డి లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వం మరో సారి పేదల ఇళ్ళను క్రమబద్ధీకరించడానికి అవకాశం కల్పించిందని వెల్లడించా రు. సిఎం కెసిఆర్ కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. క్రమబద్ధీకరణ విషయంలో ఎవ్వరికీ రూపా యి ఇవ్వాల్సిన అవసరం లేదనీ స్థానిక మీ సేవా సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. పేదల ఇళ్ళను క్రమబద్ధీకరిస్తున్న సిఎం కెసిఆర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్ కుమార్, బాలాపూర్ ఎమ్మార్వో జనార్ధన్‌రావు, మీర్‌పేట్ మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు, స్థానిక కార్పొరేటర్లు గజ్జెల రాంచందర్, మాదరి సురేఖ రమేష్, గడ్డమీది రేఖ లక్ష్మణ్ ముదిరాజ్‌లతో పాటు సిద్దాల లావణ్య బీరప్ప, బొక్క రాజేందర్‌రెడ్డి, అక్కి మాధవి, కొంద్రు గౌరీ శంకర్, బాలమణి, ధనలక్ష్మి రాజ్‌కుమార్, ఉయ్యాల నవీన్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రూ. 32లక్షలతో నాలా పూడికతీత పనులు



నాలా పూడిక తీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

**మల్కాజిగిరి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని సత్తిరెడ్డినగర్‌లో రూ. 32 లక్షలతో చేపట్టిన నాలా పూడికతీత పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా కార్పొరేటర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనులు త్వరగా పూర్తి చేయాలని, నాలాలు శుభ్రం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్ వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్ నిరుపేదల పక్షపాతి : బేతి



పేదలకు ఇళ్ల పట్టాలను పంచుతున్న ఎమ్మెల్యే బేతి తదితరులు

**కుషాయిగూడ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** సిఎం కేసీఆర్ నిరుపేదల పక్షపాతి అని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. 58జీవో ద్వారా మంజూరైన ఇళ్ల పట్టాలను కాప్రా, ఎఎస్‌రావునగర్, చర్లపల్లి డివిజన్లకు చెందిన 369 పట్టాలను కార్పొరేటర్లు స్వర్ణరాజ్ శివమణి, బొంతు శ్రీదేవి రామ్మోహన్, శిరీషరెడ్డిలతో కలిసి పట్టాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఎర్ర కొండల్ గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డం రవికుమార్, కాప్రా తహసిల్దార్ అనిత, తదితరులు పాల్గొన్నారు. అదే విధం గా కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్పేట్ హెచ్.పీ కాలనీ, మల్లాపూర్ నాచారం డివిజన్లో స్థానిక కార్పొరేటర్ జేరిపోతుల ప్రబుదాస్ ఆధ్వర్యంలో మంజూరైన 72పట్టాలకుగాను 458పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ఎమ్మార్వో గౌతమ్‌కుమార్, నాయకులు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, బన్నాల ప్రవీణ్, గిరికా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు : రాగిడి

**ఉప్పల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** మధురా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు చిలుకానగర్ డివిజన్ సెయింట్ మార్క్స్ స్కూల్‌లో ట్రస్ట్‌ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పేదలకు గత 20 సంవత్సరాల నుంచి వివిధ సేవా కార్యక్రమాలు అందిస్తు న్నామన్నారు. పేద మహిళలకు ఉచితంగా ఉపాధి కల్పనతోపాటు, కుట్టు మిషన్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామన్నారు. నిరు ద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నా రు. ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని విద్యార్థులకు చేయూత అందిస్తు న్నామన్నారు. వికలాంగులకు క్రీడా సామాగ్రి అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నేతలు పి.నరసింహారెడ్డి, భానుగౌడ్, మాజీ కౌన్సిలర్ రాజ్యలక్ష్మి, డిసిసి వైస్ ప్రసిడెంట్ షేక్ మదర్‌వలీ, నరేష్, శేఖర్‌రెడ్డి, ఐలేశ్వర్ గౌడ్, ఎం.శ్రీనివాస్‌గౌడ్, కె.వెంకటేష్, బి.జనార్దన్, నరేష్, ముత్యాల కిరణ్, నాగన్న, మధు, అవినాష్, ఉమేష్, నవీన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక అభివృద్ధికి కృషి : ప్రభుదాస్



స్మశాన వాటికను సందర్శించిన కార్పొరేటర్ ప్రబుదాస్, అధికారులు

**కుషాయిగూడ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** స్మశాన వాటికలను సుందరీకరించి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని మీర్పేట్ డివిజన్ కార్పొరేటర్ జేరిపోతుల ప్రబుదాస్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్పేట్ డివి జన్ గౌడ సంఘం స్మశానవాటికలో మౌలిక వసతుల ఏర్పాట్లపై జిహెచ్ఎంసి అధికారులతో పర్యటించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ డివిజన్ పరిధిలో స్మశానవాటికలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ స్రవంతి, వర్క్ ఇన్స్పెక్టర్ చారి, నాయకులు రాజుగౌడ్, బాలరాజ్‌గౌడ్, రంగు ప్రసాద్, సాయిగౌడ్, విజయ్, శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, జైపాల్, నిసార్ అహ్మద్, గోరి, దండం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ శోభ యాత్రను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



హనుమాన్ శోభ యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** హనుమాన్ జయంతి వేడుకలు ఘనం గా నిర్వహిస్తున్నామని శోభాయాత్రను విజయవంతం చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీన హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శోభా యాత్ర పోస్టర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం నుండి కర్మాన్‌ఘాట్ ధ్యానాంజనేయస్వామి టెంపుల్ వరకు సాగనున్న ఈ బృహత్తర శోభయాత్రలో నియోజకవర్గం నుండి వేలాదిగా భక్తులు తరలి రావాలని కోరారు. బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమై శోభాయాత్ర నిర్వహణ తీరుపై చర్చించామన్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం నుంచి హనుమాన్ జయంతి శోభయాత్ర ప్రారంభమవుతుందని, భక్తులకు త్రాగునీటి సౌకర్యం, మజ్జిగ సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. అందుకు సంబంధించి రోడ్డు మ్యాప్‌ను వివరిం చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతనాయక్, మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాసరావు, కొప్పుల విఠల్‌రెడ్డి, భవాని ప్రవీణ్, వజీర్ ప్రకాశ్‌గౌడ్, సామ తిరుమలరెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, తోట మహేష్‌యాదవ్, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, చింతల రవికుమార్, మల్లారెడ్డి, సత్యంచారి, రాజిరెడ్డి, శ్వేతారెడ్డి, ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, అంజలి పాల్గొన్నారు.

## మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం : చైర్‌పర్సన్ అనితానాయక్



చైర్‌పర్సన్ అనితానాయక్, దామోదర్, భూమేష్‌లను సన్మానిస్తున్న డైరెక్టర్లు

**మలక్‌పేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్నివిధాలుగా అభివృద్ధి చేసి ఆధునీకరిస్తున్నట్లు చైర్ పర్సన్ అనితానాయక్, ఎస్‌జిఎస్ దామోదర్‌లు పేర్కొన్నారు. మలక్‌పేట మార్కెట్ కార్యాలయంలో కమిటీ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాలకవర్గ సభ్యులు, అధికారులతో మార్కెట్ కమిటీ అభివృద్ధి, మార్కెట్ ఫీజు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్కెట్‌లో కోటి 30లక్షల రూపాయలతో పలుఅభివృద్ధి కార్య క్రమాలు చేపట్టామన్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నా మన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 10 కోట్ల 57 లక్షల మార్కెట్ ఫీజు వసూలు సేకరించామన్నారు. రానున్న 2023-24 ఆర్థిక సంవత్సరానికి టార్గెట్‌ను నిర్ణయించడం జరిగిందన్నారు. అత్యధిక మార్కెట్ ఫీజు సేకరించడంతో చైర్‌పర్సన్ అనితానాయక్, ఎస్‌జిఎస్ దామోదర్, గ్రేడ్ 3 కార్యదర్శి రవీందర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ భూమేష్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మైల రవికాంత్, బట్కిరి విద్యానర్ రాముయాదవ్ నరేష్, లలిత, అభిషేకం, సల్మాన్‌ఖాన్, ఎజాస్, మాణిక్‌రావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## జోవో నెం58,59 ద్వార ఎంతో మంది పేదలకు లబ్ది : ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



లబ్దిదారులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భేతి, కార్పోరేటర్ పన్నాల

**నాచారం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** ప్రభుత్వం తీసుకొచ్చిన జోవో నెం 58, 59 ద్వార ఎంతో మంది పేదలకు లబ్ది పొందుతున్నారని ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్ యాదగిరిఫంక్షన్ హాల్లో వివిద డివిజన్ల నుంచి 58, 59 జీవో కింద ధరఖాస్తు చేసుకున్న పలువురికి కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి లబ్దిదారులకు ఎమ్మెల్యే పట్టాలను పంపిణీ చేశారు. ఒక్క మల్లాపూర్ డివిజన్‌లోనే 222 మందికి పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ తహసిల్దార్ గౌతమ్‌కుమార్, నాచారం ఇన్స్‌పెక్టర్ నందీశ్వర్ రెడ్డి, కార్పోరేటర్లు జెర్రిపోతుల ప్రభుదాస్, నాచారం కార్పోరేటర్ శాంతిశేఖర్, మాజీ కార్పోరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సాయిజన్ శేఖర్, బన్నాల ప్రవీణ్, వెంకటేశ్వర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, వాసుగౌడ్ పాల్గొన్నారు.

## అక్రమాలను ప్రశ్నిస్తే అరెస్టులా.. సిగ్గుచేటు

**హయత్‌నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** 10వ తరగతి పరీక్షా పత్రం లీకేజీకి నిర సనగా పోరాడుతున్న యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ హయత్‌నగర్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎస్ఎస్‌సీ బోర్డు ముట్టడి సందర్భంగా యువ జన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులను అరెస్టు చేసి జైలుకు తరలించడా న్ని నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం హయత్‌నగర్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. అక్రమాలను ప్రశ్నిస్తే పోలీసుల సహాయం తో అరెస్టులు చేస్తారా అంటూ మండిపడ్డారు.

## నిరుపేదలకు అండ సిఎం సహాయనిధి : సత్తయ్య



సిఎం సహానిధి చెక్కులను అందజేస్తున్న కొత్తకుర్మ సత్తయ్య తదితరులు

**తుర్కయాంజాల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎం సహాయనిధి పథకం చేయూతనందిస్తూ, బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య పేర్కొన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లికి చెందిన కొంతం కృష్ణారెడ్డికి రూ.52వేలు, కమాటి లిఖితకు రూ.22వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సత్తయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరమని, ఈ పథకంద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే సదావ కాశం లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఏనుగు అయ్యప్పరెడ్డి, కొంద్రు శ్రీనివాస్, మర్రి సంపతీశ్వర్‌రెడ్డి, కొంతం యాదిరెడ్డి, కందాడి కరుణాకర్‌రెడ్డి, గొరిగె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.